# గౌరవనీయులు

ఓగేటి శివరామకృష్ణ

దొంగల దిబ్బ పంచాయితీ పెద్దలందరూ ఒక్కొమ్మడిగా హటాత్తుగా చేరి యేదో పెద్ద విషయం చర్చనీయమయినట్టు చర్చ జరుపుకొనసాగారు. మెంబర్లంతా ముందేవచ్చి యుండటంవల్ల ప్రెసిడెంటుగారు నెమ్మదిగా ఆయాసపడుతూ (లావుగా ఉంటాడులెండి ఆయన) ఒచ్చాడు. ప్రెసిడెంటు అన్న గౌరవంతో సభ్యుల్లో యెవరూ నిలబడలేదు సరిగదా.... ఆయన యెదురుగానే అప్పటిదాకా కాలుస్తున్న చుట్ట ముక్క పారేసి "ఏమిటయ్యా పెద్దమనిషీ... నీవే యిలా ఆలస్యంగా వస్తే యెల్లాగ? అంతా వచ్చి కూర్చుండారు .. దొరగారిలా.. నెమ్మదిగా...భోజనంచేసి వచ్చేదాకా మేం...నీ కోసం కూకోవల్సిందే...అయ్యవచ్చేదాకా...అమావాస్య ఆగుతుందటయ్యా...ఏదో నీ మీదుండే ప్రేమకొద్దీ యింతసేపు కూకుండాంగాని" అన్నాడో పెద్దాయన...మీసంమీద చేయివేస్తూ.

"అవును ప్రెసిడెంటుగారూ.... మీరింత అలస్యం చేస్తే యెట్లాగ...రేపులేదు...ఎల్లుండి ... గౌరవనీయులు వస్తారంట... మన ఊళ్ళోంచి యెళ్ళేటప్పుడు మనం యెంత అడావుడిగా ఉండాలి" అన్నాడు హరిజనసభ్యుడు—

"చేసేదేముంది... ఏకగ్రీవంగా మనమంతా ...తీర్మానం చేసేదాం...ఉన్నాడుగా-మన ప్రభాకరంగారు...ఇంతది అంతచేయడానికి మన తీర్మానం పెద్దదిచేసి సమర్పించేస్తే సరిపోతుంది ...." అన్నాడో బురఖారాయుడు...ఆయనగూడా తోటి సభ్యుల్తోపాటు వేలిముద్ర తరగతి ప్యాననవాడే లెండి...

"ఆ...అట్లాగంటే యెట్లా...ప్రభుత్వ పెద్దవ్వాడూ యిటు రాడు...మన గ్రామం మీదుగా యెల్తూండటం నిజంగా మన అదృష్టం మనకీలాటి వీలు తర్వాత ప్రయత్నిద్దామంటే వస్తుందా...మన గ్రామం తరఫున మనం చేసే ఆహ్వానంతో...గౌరవనీయులు యెంతో సంతోషించి మనకు తగినమేలు చెయ్యకుండా ఉంటారా? నా మాటని...అఖండస్వాగతం ఆయన కివ్వటం మనకే కాక మన గ్రామభవిష్యత్తుక్కూడా చాలా శ్రేయస్కరం...తరుణంమించిపోతే దొరకదు... మనం యిచ్చిన ఆహ్వానంతో వారు తీవ్ర సంతృప్తిపొంది మనకు... మనగ్రామానికి.... తగిన సదుపాయలు చేస్తారు. మన గ్రామానికి...సోమిదేమి పురానికి మధ్య రోడ్డులేదు గదా...ఎరవ మట్టిరోడ్డేగాని... వేయించటానికి మన దగ్గరయేం యేడ్చింది...కాని యీ మార్గంలో యెల్లడానికి యెంతో బాధపడుతున్న సంగతి మీ కందరికీ తెలుసుగదా (ఆయన స్థితి ఓనరులెండి) అందువల్ల ముందుగా మనం అధికార్లను మంచి చేసుకోడానికి అఖండంగా ఆహ్వానిద్దామంటే వారు మన కోరికల్లో అన్నీ కాదన్నా, చివరకు రోడ్డువేసే సహాయమైనా అనుకూలంగా ఏర్పాటు చేస్తారు...మనం యిచ్చే స్వాగతంమీద మనం మరెన్నో పనులు చేయించవచ్చును... ఈలాంటి సమయంలో తరుణం పోగొట్టుకో కూడదు"— అన్నాడొక ప్రభుత్వాభిమాని.

"నిజం...మన అబ్బారావు చెప్పినమాట నిజం"....మన గ్రామానికి ఎన్నో నిర్మించవలసిన అవసరం ఉంది...ఈలాటిసమయంలో మరి ఉన్నదబ్బు ఖర్చుచేసయినా అన్ని మేళ్ళుచేకూర్చుకునేందుకు...ఆహ్వానించితీరాలి" అన్నాడు మరొకాయన అబ్బారావుమాటలను సమర్థిస్తూ.. అబ్బారావు....మూలకంగా తనకుమాత్రుడికి [illegible]

పీరింగులో సీటు దొరికింది. అంతకన్న మరేం లేదు. అలా చెప్పడానికి కారణం.

"ఎందుకర్రా యింత హంగామా ...ఆ వచ్చే గౌరవనీయులు మన గ్రామానికి ప్రత్యేకంగా వచ్చే యేర్పాటేమయినా ఉంటే మనం యెంత అట్టహాసంచేసినా బాగుంటుంది. శ్రీవారు మన గ్రామానికి ప్రత్యేకంగా వస్తున్నారు కనుకనా మనం హడావిడిపడటానికి. అందువల్ల యేదో . సన్మానపత్రసమర్పణతో ముగించివేస్తే చాలా బాగుంటుంది" అన్నాడో వృద్ధవయస్కుడు.

ఈలా ఎవరికి తోచినట్లుగా వారు తమకు తోచిన విషయాలు, సలహాలుగా చెబుతున్నారు వాళ్ళగోల కాకులు గోలలాగ ఉండటంవల్ల మిగిలిన కొద్దిమంది యెంత మాట్లాడుదామని ప్రయత్నించినా సాగటం లేదు.

ఏలాగయితే అధ్యక్షులవారు ధైర్యచేసి "ఏమయ్యా...విషయం అందరికీ తెల్సిందో లేదో . విచారింపకుండానే ఆలా కాకిగోల చేస్తే ఎట్లాగయ్యా ? కాస్త ఆగండి ..మన తీర్మానాన్ని సభలో ఘుందు ప్రవేశపెట్టిన తర్వాత. మీ ఆమోదంమీదనే అన్నీ చేదాం" అన్నారు.

"ఆ...మీ కాకిగోల యిలా...మరి జరుగుతూనే యుంటుంది...మరి మేం ముఖ్యంగా ఓ తీర్మానాన్ని మీ ద్వారా... పంచాయతీబోర్డువారి అనుమతిమీద .ప్రతిపాదించ తలచుకొన్నాం. . మరి యీలా తగువులాడుకొంటూ కూర్చుంటే, మరి మా సంగతి యేం కాను ?" అన్నాడొకాయన.

"సరే ..ముందీసంగతి చూచింతర్వాత ..మీ చిత్తు తీర్మానాల సంగతి చూచుకొందాంలెండి, సరి...యే విధంగా తీర్మానిస్తే ..ఆ విధంగా నా అనుకూలత ఎలియపరుస్తూ సంతకంపెట్టడానికి అడ్డులేదు ముందు మీలో మీరు ఆలోచన చేసుకొని ఏకతీర్మానాలు చేసుకురండి ..నే సంతకం పెట్టేస్తా, సరే ఇంతట్లో ఓ చుట్టముక్క కాల్చుకొస్తా. ముందీ పని కానియ్యండి—" అంటూ అధ్యక్షులవారు చుట్టముక్క నోట్లో పెట్టుకొని, అగ్గిపెట్టె ఒక సభ్యుడిదగ్గరనుండి అడిగి పుచ్చుకొని బయటకెళ్లారు.

అధ్యక్షులు వారు బయటకు వెళ్ళటంతోటే, అంతవరకూ ...భయభక్తుల్తో మేష్టారి యెదట కట్టుబడియున్న పిల్లకాయల్లా ఒక్కసారి, గుప్పుమన్నారు.

సభ్యుల్లో అనేక తరగతులు - వ్యక్తులున్నారని, యిదివరకే మీకు మనవిచేశాను. అందువల్ల అనేకవిధాలుగా అనేక అభిప్రాయభేదాలతో సుమారు ఒక అరగంట పాటుగా చర్చ జరిగింది. ఏలాగయినా ప్రభుత్వసొమ్ములు తిని బ్రతుకుతున్న సభ్యులు హెచ్చుగాఉండటంవల్ల ఆ వచ్చే గౌరవనీయులకు అఖండస్వాగతం యిచ్చితీరాలని మొత్తం సభ్యులు నిశ్చయించుకొన్నారు.

"సరి ..మరి యే మాత్రం డబ్బు ఖర్చుచేదామంటారు ?—అధ్యక్షులవారు ?

"ఏమాత్రం యేమిటి ?"—ఈలాటి ప్రయత్నం మరి మనం కోరుకొంటే మాత్రం వస్తుందా ? అందువల్లా...మన పంచాయతీ ఆదాయంలోంచి యీ మధ్య తీసిన మొత్తాలు తక్కువ అవటంవల్లా యీ సమయంలో మరింత ఖర్చు చేయటం న్యాయం" అన్నాడు లచ్చారావు,

"సరే...ఆహ్వానించటానికి ఏమాత్రం డబ్బు తీయాలి ..దీనికి పెద్దరాద్ధాంతసిద్ధాంతాలు చేస్తారుగాని మీరు" అన్నాడొక యేళ్ళుమీరిన పెద్ద

"మీరు యెన్నివిధాల యేర్పాటుచేసుకొన్నా... ప్రస్తుతః—ఈ విషయంలో మట్టుకు నే చెప్పే మాట ప్రకారం నడవండి...నన్ను మన్నించండి .." అన్నాడు లచ్చారావు ప్రభుత్వం తరఫున మాట్లాడుతూ. సరే అలాగే చేద్దాం లచ్చారావు. మనలో మంచీ చెడ్డా ఆయనచేతిలోనే జరుగుతోంది....ఆలాగేనయ్యా" అన్నాడు

అందరి బదులూ...తానే మాటాడుతూ... యిందాకా ఆహ్వానించితీరాలి అని లచ్చారావుల ప్రోత్సాహపరచినాయన.

సరే... మొత్తంమీద సభ్యులందరూ గౌరవనీయుల్ని అఖండంగా సన్మానించటానికి అంగీకరించారు...బోర్డు ఆదాయం రెండువేలరూపాయల చిల్లర ఉంది. లచ్చారావు ఉద్దేశంలో ఒక అయిదువందలయినా ప్రత్యేకంగా యీ సమయంలో ఖర్చుపెట్టాలని.

ఖర్చుపెట్టడానికి .. తగిన కారణాలు కన్పించవద్దూ సభ్యులంతా ఆలోచనలో తిరిగిపడ్డారు .. ఎవరికివారూ తోచిన సలహాలు వాళ్లు యిచ్చారు. మొత్తంమీద అయిదువందల రూపాయలూ చిన్న పర్సులో పెట్టి యిస్తే బాగుంటుందన్న-ఒకసభ్యుని అభిప్రాయం కొద్దిమందికి నచ్చింది, కానయితే గౌరవనీయులు డబ్బుకోసం సంచారంచేస్తున్నారా!' అని ప్రశ్న లచ్చారావువేయటంతోటే ఆ ప్రశ్న అంతటితో ముగిసిపోయింది.

'మరేం చేయటం!'—అధ్యక్షులు తీవ్ర సమస్యలోపడి కొట్టుకొంటూంటే లచ్చారావే తిరిగి అన్నాడు: "అంతమందీ ఊకొమ్మడిగా నామాట మీద నడవాలి ...ఏమంటే....ఈలాటి సమయంలో మనం చేసేఖర్చు .. అనేక మార్గాల మనం రాబట్టుకోవచ్చు ... ఫలనా ఊరిలో గౌరవనీయులకు ఫలనా స్వాగతం యిచ్చేమని పత్రికలో న్యూసు పడటంతోటే, ఏమూలఉందో తెలియకుండా ఉన్న మన గ్రామానికి ప్రాముఖ్యత వస్తుంది సర్కారు రోడ్లు.వస్తవి (ముఖ్యంగా అనుసరు కావలసినవి) ఉన్నతపాఠశాలలు వస్తాయి ..వేయబడుతూన్న విద్యుచ్ఛక్తి మన గ్రామంలోంచిగూడా వెళ్ళనిస్తారు ఈలాటనేక సదుపాయాలు పొందబోయేమనం. మరి ఆలోచించటం మంచిదికాదు .. నేనిదివరకే మాట్లాడి ఉంచాను మీఅందరి అనుమతీ అయితే అవిధంగా చేస్తాను....

నల్లుల పల్లిలో సర్కసు దేరాలు వేశారు ... వాళ్ళ యేనుగు అద్దెకు కోరితే మూడువందల ఏభై రూపాయల కిస్తామన్నారు గౌరవనీయుల్ని చక్కగా గజంమీద ఊరేగించి పురవీథుల్లో తిప్పితే ..వారికి యేనుగ యెక్కిన గౌరవం దక్కటమేకాకుండా మన గ్రామస్థులు యీ విధంగా ఘనస్వాగతం యిచ్చినందుకు యెంతో గౌరవభావం వారికి యేర్పడుతుంది...

అందువల్ల ముఖ్యంగా .... ఈ గజంమీద గౌరవనీయుల్ని గౌరవంతో పురవీధుల్లో తిప్పాదామనుకొన్న మా అభిప్రాయానికి మీ అందరూ చేయూత యిస్తే తప్పక ముందడుగువేయగలం. అంతేకాకుండా ముందుముందు మన గ్రామ భవిష్యత్తు అంతా దీనిమీదే ఆధారపడి ఉంటుందని తాము గ్రహిస్తారని, వ్యతిరేకత చూపక, అనుకూలత చూపగలరని భావిస్తాను'— అంటూ కూర్చున్నాడు లచ్చారావుగారు.

తర్కవితర్కాలు తిరిగి చాలాసేపు జరిగేయి .. మొత్తంమీద లచ్చారావుపక్షం హెచ్చుటంవల్ల . వారు ప్రవేశపెట్టిన ప్రతిపాదన మొత్తంమీద నెగ్గుకొచ్చించి ... లచ్చారావు మీసంమీద చేయవేసి నవ్వాడు.

ప్రతికూలపక్షం సభ్యులు యిద్దరున్నా వాళ్ళిద్దరూ కేవలం ...గ్రామావసర కార్యవిషయంలో ఒక తీర్మానం ప్రవేశపెట్టి, గ్రామ ఉపయోగత ప్రస్తుతం కోరేవారవటంవల్ల వారుగూడా లచ్చారావు తీర్మానానికి అడ్డుచెప్పలేదు.

మొత్తంమీద లచ్చారావుగారు గౌరవనీయుల్ని గజంమీద ఊరేగించేనిమిత్తం మూడువందల యేభై రూపాయలూ . మరి స్వాగతపత్రాలు, భాజాభజంత్రీలు వగైరాలకూ గ్రామ అలంకరణ నిమిత్తం మొదలైన ఖర్చులక్రింద ఒక రెండు వందల యేభై రూపాయలూ తీయవలసిందని

కోరాడు, మొత్తంమీద తీర్మానం యేకగ్రీవంగా ఆమోదించబడింది సభ ముగిసిందనే ఉద్దేశంతో ప్రెసిడెంటుగారు ఆదుర్దాపడుతూ 'మరి సంతకం చెయవ్చా?' అని ప్రశ్నించాడు!

"ఆ కావివ్వండి"—అన్నాడు లచ్చారావు..

"కావి మాతీర్మానవిషయం కాస్త - అన్నారు వ్యతిరేక సభ్యులు ఐకమత్యతకోసం ప్రాకులాడుతున్నట్లుగా....

"అవును... అసలు మీ విషయంయేమిటి?"- అని ప్రశ్నించారు ప్రెసిడెంటుగారు ..

"ఏవుంది... తప్పులెన్నడం"- అన్నాడు హేళనగా లచ్చారావు నవ్వుతూ...

"మా కదేవని అనుకున్నారా? ... గౌరవనీయుల్ని ఆహ్వానించటానికి ఆరువందల రూపాయలు బోర్డు ఆదాయంలోంచి తీసిన పెద్దలు మీరంతా, గ్రామ అభివృద్ధికోరుతూ .. కొద్ది మొత్తం తీసి.... ఆ పడిపోయిన గ్రంధాలయం గోడలు .... చివరకు మట్టితోనయినా యెత్తేయేర్పాట్లు చేస్తారేమోనని భావిస్తున్నాం, ఓ పాతిక రూపాయలయితే, తిరిగి గోడలు యధాప్రకారం లేపేయచ్చు .... అభివృద్ధి పొందుతున్న మన గ్రామంలో గ్రంధాలయం జీర్ణించిపోతూ ఉండటం తగదు. అందువల్ల పాతిక రూపాయల మొత్తంతో గ్రంధాలయం గోడలు గట్టిపడ్తాయి .. " అన్నాడు ఒక వ్యతిరిక్త సభ్యుడు.... "అవును .... ఉన్న పుస్తకాలు దొంగిలించుకుపోతున్నారు ... గోడలులేకుండా గ్రంధాలయం నిలవటం చాలా కష్టం .... మీరువా కట్టులు ... మంచివికావు. లచ్చారావుగారేదో చవక సరుకు తెచ్చి ఆకారంమాత్రం చూపారు రెండు సంవత్సరాలకాలంగూడా జరుగలేదు. అప్పుడే పుచ్చిపోయాయి.. .ఏమయినా ముందుగా గోడకట్టడం విషయం అవసరం...గోడ నిర్మాణం జరిగితే నెమ్మదిగా . బీరువా తలుపులూ, చట్రంసంగతి చూచుకోవచ్చు'' అన్నాడు మరో సభ్యుడు...

లచ్చారావు - చురచుర కోరచూపులు చూశాడా యిద్దరివైపు... "కింకర్తవ్యం?" అన్నట్లుగా ప్రెసిడెంటుగారు సభ్యులవైపు .. వ్యతిరిక్తులవైపూ ఒకేమారు చూశారు...

సభ్యుల్లోగుసగుసలు తిరిగి సాగాయి. లచ్చారావు...కొద్దికాలం ప్రెసిడెంటుగారితో యేమిటో గుసగుస లాడాడు. తాము పెట్టిన తీర్మానం... ఆమోదింపబడుతుందని సభ్యులు తమలోతాము మాట్లాడుకొని నవ్వుకొంటున్నారు...

ప్రెసిడెంటు...ఏమిటో ఆలోచిస్తూంటే లచ్చారావు తిరిగి లేచి "ప్రస్తుతం గ్రంధాలయం విషయంలో పాతిక రూపాయలు కాదు పాతిక దమ్మిడిలుగూడా యివ్వటానికి వీల్లేకుండాఉంది. మీరే యోచించండి ...గ్రంధాలయం యెవరి ఉపకరిస్తూందనీ? మీలో ఎవరైనా ... ఒకమారైనా అటుపోయి చదువుతున్నారా? అనవసరపు ఖర్చులకు బోర్డు నిల్వధనంనుంచి ఖర్చుచేయటం నాకు సుతరామూ యిష్టంలేదు, మన ప్రెసిడెంటుగారు గూడా అదేమాట అన్నారు నా సోదర సమానులైన వ్యతిరేకపక్ష సభ్యుల తీర్మానానికి అనుకూలంగా మాట్లాడనందుకు చాలా విచారంగా ఉంది" అన్నాడు...

"ఆ— అవును— అదివిజం"— అన్నారు ప్రెసిడెంటుగారు, వ్యతిరేకపక్ష సభ్యులు రెచ్చారు —చివరకు ఓటింగు పెట్టవలసివచ్చింది—లచ్చారావుపక్షం మూడు; వ్యతిరేకపక్షం రెండూ సంపాదించుకొన్నారు—సభ్యుల్తోబాటు సభలో గుమిగూడిన బ్రజలంతా—లచ్చారావు పకపకనవ్వటంతోను లచ్చారావుగారికిజై — ప్రెసిడెంటుగారికీజై అన్నారు — ప్రెసిడెంటుగారు గౌరవనీయులను గౌరవించటంకోసం ఖర్చుచేయబోయే ఆరువందల రూపాయలకూ అంగీకారం చూపుతూ— తీర్మానాల పుస్తకంలో సంతకం చేశారు!